క్లుప్తంగా

విజేతలకు ప్రశంస



ప్రశంసాపత్రాలు అందుకున్న క్రీడాకారులు

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం కొత్త పాళెం సమీపంలో నెహ్రూయువ కేంద్రం, యువనేస్తం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ అర్జున్ జట్టు, నాదముని జట్టు మధ్య జరగగా అర్జున్ జట్టు విజేతగా నిలిచింది. అలాగే బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా యశ్వంత్, లోకేష్ జట్లు, రన్నర్లుగా పవన్, మురళి జట్లు నిలిచాయి. విజేతలకు యువనేస్తం జశ్వంత్, మునిశేఖర్, వినోద్ షీల్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కేశవులు, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు



సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

రేణిగుంట (ఏర్పేడు) : ఏర్పేడు మండలంలోని వికృతమాల సంతాన సంపద శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 10వ తేదీన జరిగే వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లను ఆదివారం రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. తొలుత ఆయన ఆలయంలోని సంతాన సంపద శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు రత్నాకరం రామాచార్యులు, కృష్ణమాచార్యులు ఆయనకు ఆశీస్సులు అందజేశారు. ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు, భక్తులకు కల్పించాల్సిన వసతులు, భద్రతాపరమైన చర్యల గురించి ఆలయాధికారులకు పలు సూచనలు చేశారు.

క్రీడలతో ఉల్లాసం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, ఆరోగ్యం వస్తుందని ఎస్ఐ విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. ఆదివారం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బీఎన్కే యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. యూత్ క్రికెట్ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, విజేతలకు నగదు బహుమతి అందజేస్తామని నిర్వాహకులు తిరుమల, దొర్రై, అఖిల్ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాలగురవయ్య, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎన్వీఎస్ బాబు సేవలు చిరస్మరణీయం



పేదలకు అన్నదానం చేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేత ఎన్వీఎస్ బాబు చిరస్మణీయులని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఎన్వీఎస్‌బాబు రెండో వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్మికుల అభ్యున్నతికి ఎన్వీఎస్ బాబు ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పసుపులేటి శ్రీనివాసకుమార్, జీపీఎస్ ఆచారి, టీఎం ఆచారి, డీఎంకేసి రెడ్డి, బీఎస్ఆర్ కుమార్, పీఎస్ ప్రసాద్, టీఎల్‌మూర్తి , కప్పయ్య, సూరిబాబు, కుమార్, కేపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద సీఐడీ ఎస్పీ సరిత

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం వేర్వేరు సమయాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర సీఐడీ ఎస్పీ సరిత, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు దర్శించుకున్న వారిలో ఉన్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

సంక్రాంతి దుత్తలు



సంక్రాంతి పండుగ సందర్భంగా ఇరుగుళం, పేరడం గ్రామాల్లో పొంగళి కుండలు తయారు చేసి విక్రయానికి సిద్ధం చేశారు. సంక్రాంతి రోజున రైతులు కొత్త కుండలో పొంగళి చేసి నైవేద్యంగా పెట్టి పూజలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. సత్యవేడు, మదరపాకం, ఆరంబాకం, మానెల్లూరు, గుమ్మడిపూడి, తడ, కవర్‌పే, సూళ్లూరుపేట, ఊత్తు కోట ప్రాంతాల్లో కొత్త కుండలు సంక్రాంతికి అందించేందుకు సిద్ధం చేసి ఉంచారు. – సత్యవేడు

మురుగునీటి ప్రవాహం

ఆ కాలనీ నుంచి బయటకు వెళ్లాలంటే మురుగు నీటిలోనే వెళ్లాలి. సుమారు 500 కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్న కాలనీకి వెళ్లే రహదారిని పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. రేణిగుంట మేజర్ పంచాయతీకి అధిక ఇంటి పన్నులు చెల్లిస్తున్న బిస్మిల్లానగర్, భగత్‌సింగ్ కాలనీ, వివేకానంద కాలనీ, జ్యోతిరావు పూలే కాలనీ, వసుంధరానగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. మురుగు కాల్వనీరు ఆ గుంతల్లో చేరి మురుగు గుంతలుగా దర్శనమిస్తున్నాయి. ఆ రోడ్డులో వాహనదారులు, విద్యార్థులు మురుగు నీటిలో వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. – శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)



ఫ్లెక్సీల జోరు.. వాహనదారుల బేజారు



రేణిగుంటలోని ప్రధాన కూడళ్లలో రమణ విలాస్ సర్కిల్, కేఎల్ఎం హాస్పిటల్ సర్కిల్, పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం కూడలి, ఎన్టీఆర్ విగ్రహం , వైఎస్సార్ విగ్రహం కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లెక్సీలు ఉండటంతో అటువైపు వాహనాలు కనపడటం లేదు. ఈ ఫ్లెక్సీలు రోజుల తరబడి ఉంచడంతో చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికంగా అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు ఉండడంతో పోలీసులు, పంచాయతీ అధికారులు తమకు ఎందుకులే అనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇకనైన వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ఫ్లెక్సీలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. – శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

ఖో పెడితే పతకమే!

విద్యార్థుల ఆసక్తి, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో మెలకువలు గ్రహించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి పతకాల పంట పండిస్తున్నారు. సత్యవేడు గురుకుల విద్యార్థులు ఆటలు, చదువును సమన్వయం చేసుకుంటూ పాఠశాల, పుట్టిన ఊరికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీల్లో రాణిస్తున్నారు. ఇటీవల రాష్ట స్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పలువురి ప్రశంసలు అందుకున్నారు.

- రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో సత్తా
- పోటీ ఏదైనా పతకమే లక్ష్యం
- అన్ని రంగాల్లో రాణిస్తున్న గురుకుల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సత్యవేడు : శ్రీ సత్యసాయి జిల్లాలోని లేపాక్షిలో ఇటీవల నిర్వహించిన జోనల్ క్రీడల్లో సత్యవేడు బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటి బహుమతులు సాధించారు. ఖోఖో జోనల్ పోటీల్లో సత్యవేడు విద్యార్థులు పవన్‌కుమార్ (కెప్టెన్) ఉదయ్ (వైస్ కెప్టెన్) ప్రదీప్, మనికుమార్, చరణ్‌కుమార్, మనుకుమార్, దామోదరం, హేమచంద్ర, విజయ్, శంకర్, సి.శంకర్, గణేష్, సతీష్ , దినేష్‌కృష్ణ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారు. మార్చ్ పాస్టులో ఉత్తమ సమూహంగా ఎంపికయ్యారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో ప్రశంసలు అందుకొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న పీడీ నాగరాజన్

ఉన్నత స్థాయికి వెళ్లాలని..



చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజన్ ప్రోత్సాహంతో రాణిస్తున్నా. ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించాం. ప్రతి రోజు సాధన చేస్తున్నా. జాతీయ జట్టుకు ఆడాలన్నదే నా చిరకాల కోరిక.
– పవన్‌కుమార్, బీసీ బాలుర గురుకులం, సత్యవేడు

జాతీయ పోటీల్లో రాణించాలి



చిన్నప్పటి నుంచి ఖోఖో అంటే చాలా ఇష్టం. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని జట్టు విజేతగా గెలిచేందుకు తోడ్పడ్డాను. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పోలీస్ ఆఫీసర్ కావాలనేది నా ఆశయం.
–హేమచంద్ర, బీసీ బాలుర గురుకులం, సత్యవేడు

ప్రభుత్వ కొలువే లక్ష్యం



ప్రస్తుతం పదో తరగతి చదవుతున్నా.గత డిసెంబరు 27, 28 తేదీల్లో శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలో జరిగిన ఖోఖో పోటీల్లో జట్టు క్రీడాకారులతో కలిసి బంగారు పతకం సాధించా. ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఆడేందుకు సాధన చేస్తున్నా. క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించి తల్లిదండ్రులకు అండగా నిలవాలన్నదే లక్ష్యం.
– దామోదరం, బీసీ బాలుర గురుకులం, సత్యవేడు

ఇంజినీరు ఉద్యోగం సాధిస్తా



అమ్మా,నాన్న వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ చదివిస్తున్నారు. నా కోసం కుటుంబం ఎంతో కష్టపడుతోంది. ఆ కష్టం కళ్లారా చూశా. వారికి అండగా నిలబడి కుటుంబానికి చేదోడుగా నిలబడుతా. ఇటీవల జరిగిన ఖోఖో పోటీల్లో బంగారు పతకం సాధించాం. క్రీడా కోటాలో ప్రభుత్వ ఇంజినీర్ కావాలన్నేది నా ఆశయం.
– గణేశ్, బీసీ గురుకులం, సత్యవేడు

ఆత్మీయ సమావేశానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సమావేశానికి తరలుతున్న మండల నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ : సత్యవేడులో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి మండలం నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనరు వేలూరు రాకేష్, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు మణినాయుడు, రవి రెడ్డి, గురునాథం, నాయకులు గురవయ్య, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చేయూత



సరుకులు అందజేస్తున్న కోట వినుత

శ్రీకాళహస్తి : హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయమని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత అన్నారు. పట్టణంలోని నగరివీధిలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా, సభ్యులు రమేష్‌బాబు, బాబా ఫరీద్, ఢిల్లీ బాబు, హరినాయుడు, తోట గణేష్ పాల్గొన్నారు.

‘ఎడ్వెన్’ ఎడిటోరియల్ మెంబర్‌గా దేవప్రసాదరాజు

తిరుపతి సిటీ : సైన్స్ జర్నల్ ఎడ్వెన్‌కు ఎడిటోరియల్ మెంబర్‌గా ఎస్వీయూ ప్రొఫెసర్ బి.దేవప్రసాద్‌రాజు నియమితులయ్యారు. ఆదివారం ఈ మేరకు జర్నల్ ప్రతినిధి నియామక పత్రం విడుదల చేశారు. ఫిజిక్స్ అధ్యాపకుడిగా ప్రస్థానం ప్రారంభించిన దేవప్రసాద్‌రాజు వర్సిటీ అడ్మిషన్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, రీసెట్ కన్వీనర్‌గా, ఫిజిక్స్ విభాగాధిపతిగా సేవలందించారు.

ఎస్వీయూలో వేతన వెతలు!

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఈ నెల కూడా ఉద్యోగులకు వేతన వెతలు తప్పలేదు. జనవరి ప్రారంభమై వారం గడుస్తున్నా ఇప్పటి వరకు జీతాలను ఖాతాల్లో జమ చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోనూ ఉంది. వేతనం అందక ఉద్యోగులు, పెన్షనర్లు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు ఆరునెలలుగా వర్సిటీలో సకాలంలో జీతాలు అందడం లేదు. అయినప్పటికీ వర్సిటీ అధికారుల పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త సంవత్సరంలో అయినా ఒకటో తేదీన వేతనాలు వస్తాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది.

గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): మేస్త్రీ పని ఒప్పుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్న ఓ మేస్త్రీని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు..రేణిగుంట మండలం తారకరామా నగర్‌లో నివాసం ఉంటున్న కృష్ణయ్య (60) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను ఆదివారం తిరుచానూరుకు వెళ్లి పని ఒప్పుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా తూకివాకం సమీపంలో నాయుడుపేట–పూతలపట్టు రహదారిపై గుర్తుతెలియని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాజులమండ్యం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.



మృతి చెందిన కృష్ణయ్య

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

- సత్యవేడు సమావేశం సక్సెస్
- ప్రజలకు అండగా ఉంటానన్న పార్టీ సమన్వయకర్త రాజేష్

సత్యవేడు : ఎన్నికల అనంతరం వైఎస్సార్‌సీపీ సత్యవేడులో ఆదివారం నిర్వహించిన నియోజకవర స్థాయి సమావేశం విజయవంతం అయింది. ఈ ఆత్మీయ సభకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ప్రాంగణం కార్యకర్తలు, పార్టీ నేతలతో కిక్కిరిసింది. కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడానికి ఏర్పాటు చేసిన సభ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సమావేశం ప్రారంభించారు. సత్యవేడు సమన్వయకర్త రాజేష్ మాట్లాడుతూ.. జగన్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి అందిందన్నారు. పోరాటాలు భూమన కరుణాకరరెడ్డికి కొత్తేమి కాదని, ఆయన అడుగు జాడల్లో నడుద్దామని పిలుపునిచ్చారు. అన్న మాట ఇస్తే తప్పే వారు కాదన్నారు. నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అమ్మ కుతూహలమ్మ, గురువు పెద్దిరెడ్డి, భూమన కరుణాకర్ రెడి, మిథున్ రెడ్డి నన్ను ఓ మెట్టు ఎదిగేలా ఆశీర్వదించారన్నారు. కరుణాకర్ రెడ్డి తిరుపతిలో చేపట్టే ప్రతి ఉద్యమంలో నేను పాల్గొనే వాడినని గుర్తుచేశారు. రాజకీయంగా పెద్దిరెడ్డి, కరుణాకర్ రెడ్డి నాకు అండగా ఉండడంతో సత్యవేడు పార్టీ శ్రేణులకు నేను మరింత అండగా నిలుస్తానని తెలిపారు. సత్యవేడులో 29,500 ఓట్లు పొందిన ఎంపీ గురుమూర్తి సత్యవేడుకు మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ రోజు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు రావడం సత్యవేడు సభ సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు అబద్దాలు చెప్పడంతో తగ్గేదేలా అన్నట్లు.. జగనన్న నిజాలు చెప్పడంలో తగ్గేదేలే అన్నట్లు వ్యవహరిస్తారన్నారు. సత్యవేడు ప్రజలకు ఇకపై రోజు అందుబాటులో ఉంటానన్నారు. సత్యవేడులో కార్యకర్తల మనోభావాలను వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి తెలపాలని జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుశీల్‌కుమార్ రెడ్డి, అపరంజిరాజు, దయాకర్ రెడ్డి, గవర్ణకృష్ణయ్య, చలపతి రాజు, సారకాయలు, పార్టీ నాయకులు బీరేంద్రవర్మ, చంద్రశేఖర్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, రమేష్, మస్తానీ, సోమశేఖర్, ఎంపీ రవి, టెంకాయ కృష్ణయ్య, శ్యాంప్రసాద్ రెడ్డి, చిన్నదొరై, మహేష్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, బొప్పన తిలక్, చిన్నా, సురేష్, వినోద్, శివ, దివాకర్‌రెడ్డి, అన్నాదొరై, ఉజ్వల్ రెడ్డి, కిరణ్‌సాయి, నందగోపాల్, మాధవిరెడ్డి, ధనంజయరెడ్డి, భాస్కర్ నాయుడు, హరిచంద్రారెడ్డి, రోస్‌రెడ్డి, తొప్పయ్య , గురవయ్య, రాకేష్, మణినాయుడు, గోవిందస్వామి, శ్రీనివాసులు రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.





వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి.. కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న నూకతోటి రాజేష్

బాలయ్య సేవలు మరువలేనివి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన భూమన, ఎంపీ

వరదయ్యపాళెం : సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి సీనియర్ నాయకుడిగా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడిగా బందిల బాలయ్య సేవలు మరువలేనివని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి అన్నారు. కంచరపాళెంకు చెందిన బందిల బాలయ్య ఇటీవల మరణించిన విషయం విధితమే. భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి ఆదివారం సాయంత్రం కంచరపాళెంలోని బాలయ్య నివాసంలో ఆయన కుమారుడు బందిల సురేష్, కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీకి బాలయ్య చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అన్నివిధాలా పార్టీ అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. వారి వెంట కార్మిక విభాగం జిల్లా మాజీ కన్వీనర్ బీరేంద్ర వర్మ, సోషల్ మీడియా కన్వీనర్ వేలూరు రాకేష్, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మాజీ ఎంపీటీసీ దామోదర్‌రెడ్డి, పార్టీ నేతలు శోభన్ యాదవ్, మహేంద్ర, మాధవయ్య, గురవయ్య ఉన్నారు.



పరామర్శిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ మద్దెల గురుమూర్తి